www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 డిసెంబర్ 2025
5
కాకినాడ



నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 13న నిర్వహించే నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు జవహర్ నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 32 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కాకినాడ జిల్లాలో 12, కోనసీమ జిల్లాలో 15, తూర్పు గోదావరి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 7,140 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 13వ తేదీ ఉదయం 11:30 గంటల నుంచి 1:30 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు నవోదయ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు.

రోడ్లపైనే ఆహారం అమ్మకాలు

- నాసిరకం ఆయిల్, హానికర రంగులు
- ప్రమాదంలో ప్రజారోగ్యం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజలు బయట ఆహార పదార్థాలు ఎక్కువగా తింటుంటారు. ఆకర్షణీయంగా కనిపించే వాటిని రుచి చూసేందుకు ఎగబడుతుంటారు. అయితే వాటిని రుచికరంగా మార్చడానికి అనేక రకాల రసాయనిక పదార్థాలను వినియోగిస్తారు. నాసిరకం ఆయిల్‌తో బాటు వివిధ రకాల హానికరమైన రంగులను వినియోగిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై ఎటువంటి శుభ్రత లేకుండా విక్రయాలు జరుపుతున్నా కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవి తింటున్న పలువురు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది.

జిల్లాలో ఎక్కడికక్కడ పదుల సంఖ్యలో తినుబండారాలను అమ్మే దుకాణాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం కాకినాడలో సుమారు 2 వేల దుకాణాలు ఉంటాయి. ఒక్కో పట్టణ కేంద్రంలో 500 వరకూ మండల కేంద్రాల్లో 200, ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో తినుబండారాలు విక్రయించే చిన్న చిన్న బడ్డీ దుకాణాలు ఉంటాయి. తినే పలు ఆహార పదార్థాలను రోడ్ల పక్కనే దుమ్ము దూళిలోనే విక్రయిస్తూ ఉంటారు. ప్రజలు ఇవేమీ పట్టించుకోకుండానే వాటిని కొనుగోలు చేసి లొట్టలేసుకుని తింటూ అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ప్రజలు అనేక రోగాలతో సతమతం అవుతున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. పలు రకాల రోగాలకు మనం తినే ఆహారం పదార్థాలే కారణం అంటూ వైద్యులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. వంటల్లో నూనెలు తగ్గించాలని, ఫాస్ట్ ఫుడ్లు వాడరాదని, హానికరమైన రంగులు వినియోగించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ ఉంటారు.

ఇష్టారాజ్యంగా కల్తీ నూనెల వినియోగం

పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, దాబాలు, రెస్టారెంట్లు, బజ్జీల దుకాణాలు, గోబీ సెంటర్లు ఇలా అనేక చోట్ల కల్తీ నూనెలు ఎక్కువగా వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మల్టీస్టోర్స్ విజిటబుల్ అయిల్స్ అగ్ మార్క్ నిబంధనల ప్రకారం నిర్దేశించిన పరిమాణంలో మాత్రమే నూనెలు కలపాల్సి ఉంది. ఇవేమీ పట్టించుకోని వ్యాపారులు ఇష్టానుసారంగా కల్తీ నూనెలు వినియోగిస్తున్నారు. రెండు మూడుసార్లు కంటే ఎక్కువగా వాడిన నూనెనే మళ్లీ మళ్లీ ఆహార పదార్థాలకు ఉపయోగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి.



రోడ్లపైనే ఆహార పదార్థాల విక్రయాలు

అంతేకాక ఆరోగ్యాలను పూర్తిగా హరించే టేస్టింగ్ సాల్ట్ ఎక్కువగా వాడుతున్నారు. కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను అధికంగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా బేకరీల్లో వాడుతున్న రసాయనాల వల్ల చిన్నపిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. మరో వైపు పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లలో ఆకర్షణీయమైన రంగులను వినియోగిస్తున్నారు. దాబాల్లో సైతం ఆహార పదార్థాలు రుచి కోసం వినియోగిస్తున్న రసాయనాల వల్ల ప్రజలు అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు.

దుమ్మూధూళిలోనే

పలు ప్రాంతాల్లో ప్రధాన వీధుల్లో ఆహార పదార్థాలు విక్రయించే టిఫిన్ బండ్లు, స్వీట్లు అమ్మే దుకాణాలు కనిపిస్తుంటాయి. పలు రకాల స్వీట్లతో పాటు బజ్జీలు, పకోడి, బూంది తదితర తినుబండారాలను విక్రయిస్తుంటారు. రోడ్డు పక్కన వ్యాపారాలకు ఎవరూ అభ్యంతరం పెట్టరు. తినుబండారాలను దుమ్మూధూళి పడేలా ఉంచటం కచ్చితంగా వినియోగదారుల ఆరోగ్యానికి మంచిది కాదు. రోడ్లపై తిరిగే వాహనాల్లోంచి వచ్చే పొగ, టైర్ల నుంచి లేచే దుమ్ము ఎక్కువ. నూనెతో చేసిన ఆహార పదార్థాలకు దుమ్ము ఎక్కువగా అంటుకుంటుంది.

అరకొర తనిఖీలకే పరిమితమా..

ఆహార పదార్థాల్లో కల్తీలు నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుంది. ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006ను తీసుకొచ్చి అమలు చేస్తోంది. ఇది 2012 ఆగస్టు 5 నుంచి అమల్లోకి వచ్చింది. వంట నూనెలు, ఆహార పదార్థాల అమ్మకాలపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు చేస్తున్నా అమ్మకందారులు పట్టించుకోకుండా లాభార్జనే ధ్యేయంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. నిషేధిత రసాయన పదార్థాలను తినే ఆహార పదార్థాల్లో విచ్చలవిడిగా వాడుతున్నా సంబంధిత అధికారులు అంతగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ కేంద్రాలు, బేకరీలు, ఆయిల్ ఉత్పత్తి చేసే సెంటర్లు తదితర వాటిల్లో ఆహార కల్తీ నియంత్రణ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలపై నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకున్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాల అందించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన జెసి అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ మనీషా, డిఆర్ఒ జె.వెంకటరావు, జిజిహెచ్‌సి ఎఒ ఎన్.శ్రీధర్, తదితర అధికారులు జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి అర్జీలను, వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జెసి అధికారులను ఆదేశించారు ప్రజలు తమ యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జెసి తెలిపారు.


అర్జీలను స్వీకరిస్తున్న జెసి అపూర్వ భరత్

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, పెద్దాపురం

సిఐటియు 18వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వలసపాకల సుందరయ్య కాలనీలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. సిఐటియు మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకూ ఐదు రోజులపాటు విశాఖపట్నంలో సిఐటియు జాతీయ మహాసభలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత, స్కీమ్ వర్కర్ల సమస్యలు, కనీస వేతనం రూ.26 వేలు, లేబర్ కోడ్స్ రద్దు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యోగ భద్రత తదితర అంశాలపై చర్చించి, ప్రజలు, కార్మికులను, రైతులను సమీకరించి ఐక్య పోరాటాలయిఅ రూపకల్పన చేయనున్నారని తెలిపారు. సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, రామకృష్ణ, సింహాద్రి, విశ్వనాథ్, త్రిమూర్తులు, శ్రీను, రాంబాబు, ఈశ్వరరావు, రాజు, నూకరాజు, వెంకటేష్, సాయి ఏసు తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ రూరల్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్ మాట్లాడారు. నీలపాల సూరిబాబు, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, తైనాల శ్రీను, తాడిశెట్టి గంగ, అప్పన్న, సత్యనారాయణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థులకు క్రీడా పరికరాల అందజేత

ప్రజాశక్తి-కోటనందూరు

కోటనందూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సామాజిక సేవకులు మల్ల సుమిత్రరావు వరలక్ష్మి దంపతులు సోమవారం రూ.7 లక్షల విలువైన క్రీడా పరికరాలను అందజేశారని దాడి కొండబాబు మాస్టారు తెలిపారు. కోటనందూరు, బొద్దవరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహాలను అందిస్తున్నామన్నారు. క్యారమ్స్, చెస్, ఇతర క్రీడా పరికరాలను విద్యా కమిటీ చైర్మన్ గింజల దేవి, హెచ్‌ఎం కె.సత్యవతికి కొండబాబు అందజేశారు.


క్రీడా పరికరాలు అందిస్తున్న దాతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఎస్‌ఎఫ్ఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిఠాపురం

ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి కె.సిద్దు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక విద్యా సమస్యలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వల్ల చాలామంది విద్యార్థులు నష్టపోతున్నారని చెప్పారు. జిఒ నెంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెయ్యాలని, ప్రభుత్వ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని, హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ అండ్ కాస్మొటిక్ ఛార్జీలను పెంచాలని నిరుద్యోగ యువతలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, విద్యార్థుల సమస్యలపైన ఈ నెల 12, 13, 14 తేదీల్లో తిరుపతిలో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డి కాసులు, జాన్, రాము, సాయి లక్ష్మి, సిరి పాల్గొన్నారు.

సమస్యలపై సహకార ఉద్యోగుల ధర్నా

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ సహకార ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఏలేశ్వరం స్థానిక సహకార బ్యాంకు వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ మాట్లాడుతూ జిఒ నెంబర్ 36ను వెంటనే అమలు చేయాలని, 2019- 2024 వేతన సవరణ వెంటనే చేపట్టాలని, గ్రాడ్యుటీ యాక్ట్ ప్రకారం అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం, లింగంపర్తి, రాజవొమ్మంగి, అడ్డతీగల పిఎసిఎస్ సిఇఒలు జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, యు.విజయ్ కుమార్‌రాజు, జె.గోపాలకృష్ణ, ఎ.మణిరాజు ఉన్నారు.

పెద్దాపురం స్థానిక డిసిసిబి బ్రాంచ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ టియుఎన్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. జి.సత్యనారాయణ, ఎస్.నాగభూషణం, కె.అర్జునుడు, బి.శ్రీనివాస్, నల్లల సత్యనారాయణ పాల్గొన్నారు.

పిఠాపురం డిసిసిబి బ్రాంచ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు డి.శేషబాబ్జి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అంబటి సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. బ్రాంచ్ మేనేజర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కెవిరాఘువ, ఎ.రాంబాబు, ఎ.సత్య నారాయణ, ఎం.వీరభద్రరావు, ఈశ్వరుడు, ఎన్.కామేశ్వరరావు, బాబీ, వడిశెట్టి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

తాళ్లరేవు తాళ్లరేవు, కాజులూరు మండలాలకు చెందిన 6 సొసైటీల సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మద్దతు తెలిపారు. విజయ్ భాస్కర రెడ్డి, పి.గౌరీశంకర్ మోహన్, సంపత్, పి.రాజు, డి.లక్ష్మీపతిరాజు, బి.గోవిందరాజు, సిహెచ్.మూర్తి పాల్గొన్నారు.

సామర్లకోట డిసిసిబి బ్రాంచ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కె.మారుతి బాబు, జి.వెంకటేశ్వరరావు, టి.సాంబశివరావు, డి.వీరబాబు, జి.నవీన్ కుమార్, ఎం.శ్వేత పాల్గొన్నారు.

కోటనందూరు తుని సహకార సిబ్బంది ధర్నా చేపట్టారు. సిఐటియు తుని మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ సిబ్బందికి మద్దతు తెలిపారు. రామ్ నాయుడు, సింహాచలం, సతీష్ శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న సహకార ఉద్యోగులు


పెద్దాపురంలో..



పిఠాపురంలో..


తాళ్లరేవులో..

గురయ్య మృతిపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-తొండంగి

డక్కుమల్ల గురయ్య మృతిపై సమగ్ర విచారణ చేయించాలని న్యాయవాదులు, దళిత సంఘాల నాయకులు సోమవారం తొండంగి ఎస్ఐ జగన్ మోహన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గురయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేయాలని కోరారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు, మహానాడు జిల్లా నాయకులు కొంగు నూకరాజు మాట్లాడారు. కృష్ణాపురానికి చెందిన గురయ్య పోలవరం కాలువ పనుల వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తుండేవాడని తెలిపారు. తలపైన బలమైన గాయాలతో ఆయనను రిఫరల్ ఆస్పత్రిలో చేర్పించారని, కుటుంబ అక్కడకు వెళ్లి మెరుగైన వైద్యం కోసం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఆయన మృతిపై కుటుంబ సభ్యులకు అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. గురయ్య పని చేసే చోట కొందరితో గతంలో గొడవ జరిగిందని తెలిపారు. వి.వెంకటేష్, ముమ్మిడి శ్రీనివాస్, ఉదయ భాస్కర్ పోలీస్, పిల్ల రాజు, డక్కుమల్ల బ్రహ్మాజీ, వెయ్యాల సూర్యారావు, పిల్లి బాబ్జి పాల్గొన్నారు.



వినతిపత్రం అందించిన ప్రజాసంఘాల నాయకులు

కనీస పెన్షన్ పెంచాలని 'చలో ఢిల్లీ'

ప్రజాశక్తి-కాకినాడ

ఇపిఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని డిసెంబర్ 9, 10 తేదీల్లో ఢిల్లీలో సదస్సు, ధర్నాకు కాకినాడ నుండి పెద్ద ఎత్తున పెన్షనర్లు బయలుదేరి వెళ్లినట్లు ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా పెన్షనర్ల సమస్యలపై నిరసన చేపట్టడానికి రాష్ట్రం నుంచి 100 మంది పెన్షనర్లు పాల్గొంటున్నారని తెలిపారు. సత్తిరాజు మాట్లాడుతూ గీత 11 ఏళ్లుగా ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు డిఎతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1, 2014 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 17.5 లక్షల మంది పెన్షనర్లు హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేస్తే కేవలం 50 వేల మందికి మాత్రమే హయ్యర్ పెన్షన్ అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ రావు, కర్రి బాబూరావు, యుఎస్ఎన్.రెడ్డి, హుస్సేన్, పి.శ్రీనివాసరావు, జార్జ్ బర్నబాస్, పున్నారావు, బివి.రావు పాల్గొన్నారు.



చలో ఢిల్లీకి బయలుదేరి వెళ్తున్న పెన్షనర్లు

ఉత్సాహంగా ఛాంపియన్స్ లీగ్

ప్రజాశక్తి - పెద్దాపురం


స్థానిక వీర్రాజు హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న పెద్దాపురం ఛాంపియన్స్ లీగ్ క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం మొదటి మ్యాచ్ విల్లో వారియర్స్, యంగ్ ఫైటర్స్ మధ్య జరిగింది. ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఈ పోటీలో విల్లో వారియర్స్ విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా గౌరీ శంకర్ ఎంపికయ్యాడు. భారత్ సోలార్ యజమాని శివాజీ గౌరీశంకర్‌కు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ సాయి, నాగేంద్ర సాయి, భీమ సాయి తదితరులు పాల్గొన్నారు.

పాడా పీడీకి పట్టు రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు పట్టు మార్కెట్‌లో కాటా పని చేయడం లేదని పిఠాపురం పాడా కార్యాలయంలో పీడీ శ్రీనివాసరావుకి సోమవారం పట్టు రైతులు వినతిపత్రం అందజేశారు. పట్టు రైతులు ఓరుగంటి శివ, ఉలవకాయల రాంబాబు మాట్లాడుతూ సంవత్సరం కాలం నుంచి చేబ్రోలు పట్టు పరిశ్రమలోని మార్కెట్‌లో కాటా సరిగా పనిచేయక రెండున్నర కేజీలు తక్కువ చూపిస్తోందని, దీనివల్ల తాము నష్ట పోతున్నామని తెలిపారు. వెంటనే తూనికలు కొలతల అధికారులతో కాటాను సరి చేయించాలని కోరారు.

కార్టూ'నిజం'





ధర్నా చేస్తున్న మహిళలు

టిడ్కో రుణాలు రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట

టిడ్కో రుణాలు రద్దు చేయాలని కోరుతూ సోమవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద ఐద్వా అధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరమణి, జిల్లా అధ్యక్షురాలు భూలక్ష్మి మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు టిడ్కో రుణాలను రద్దు చేస్తామని ఇచిచన హామీని మరిచారన్నారు. లబ్ధిదారుల వాటా రూ.లక్ష కట్టించుకుని పదేళ్ల తర్వాత ఇల్లు అందచేశారని, రూ.3 లక్షల బ్యాంకు రుణం ఇచ్చి 20 ఏళ్ల పాటు లోను చెల్లించాలంటూ బ్యాంకు, మెప్మా సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తక్షణం బ్యాంకు రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఫ్లాట్లను రద్దు చేయాలని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యకు వినతిపత్రాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.శ్యామల, ఎం.సత్యవతి, ఎన్.వరలక్ష్మి వెంకటలక్ష్మి, శారద, ఎ.దుర్గా లక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం సామర్లకోట రహదారిలో వృద్ధాశ్రమం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. ఉజ్వల పథకం ద్వారా పెద్దాపురం పట్టణ పరిధిలో ఇప్పటివరకు 500 మందికి ఫ్రీ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్టు తెలిపారు. అర్హులైన వారు ఉంటే గ్యాస్ కలెక్షన్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, కందుల విశ్వేశ్వరరావు, అరవింద్‌కుమార్, ఎలిశెట్టి నాని, కేదారి నల్లబాబు, జల్దాని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకట్రావు, గుత్తుల సూర్యావతి, బడుగు శ్రీకాంత్, బాబు, వంశీ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన గంగుల మధు(27) ఈనెల 6వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆరోతేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఇంటి నుంచి బైకుపై వెళ్లిన ఆయన తిరిగి ఇంటిరి రాలేదు. అతని కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె తల్లి గంగుల వరలక్ష్మి పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర తేలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796662, 9154875597 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రెండిళ్లలో చోరీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపవరం గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాస్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో రూ.10 వేలు నగదు, ఎనిమిది రూపులతో లక్ష్మీదేవి నల్లపూసల దండ, పది తులాల వెండి పట్టీలు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వారి ఇంటి పక్కన ఉన్న నరాల సత్యనారాయణ ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ద్రాక్షారామ ఎస్ఐ ఎం. లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి, సిఐ

హత్య కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో కాకర అప్పారావు హత్య కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నవంబర్ 5న భూపాలపట్నంలో అప్పారావును కుళ్ళ రాజిబాబు, నాగేశ్వరరావు హత్య చేసి పరారీలో న్నారన్నారు. రాజిబాబును జగ్గంపేట మండలం రామవరం వద్ద సోమవారం అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. అప్పారావుపై ఉన్న కక్షతో తన తమ్ముడు నాగేశ్వరరావుతో కలిసి ఇనుప రాడ్లతో కొట్టి చంపినట్లు రాజిబాబు ఒప్పుకున్నాడని తెలిపారు. పరారీలో ఉన్న నాగేశ్వరరావు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఉన్నారు.



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న కంకర

బైకు జారితే ప్రాణాలకే ప్రమాదం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు లంపకలోవ గ్రామానికి వెళ్లే చెరువుగట్టు రహదారిపై గృహ నిర్మాణానికి చేపట్టే కంకర గుట్టలు రహదారికి అడ్డంగా దర్శనమిస్తున్నాయి. ఈ కంకర గుట్టలు రహదారిపై చిప్స్ రూపంలో ఉండడంతో కనీసం వాహనదారులు కూడా వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. రహదారిపై అడ్డంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కంకరపై బైకులు స్కిడ్ అవుతే రోడ్లు పక్కన చెరువులోకి వెళ్లి పడే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు గట్టు రహదారిపై సుమారు 14 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తున్నారు. ఈ రహదారిపై ఆటో వెళ్లాలన్న, కారు వెళ్లాలన్న దారి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రహదారిపై ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత అని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం 'ప్లాస్టిక్ రీసైక్లింగ్ లీగ్' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నగరపాలక సంస్థ పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈసారి వినూత్న రీతిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్లాస్టిక్ రీసైక్లింగ్ లీగ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18, 19 తేదీల్లో పాఠశాలల్లోని విద్యార్థుల నుంచి ప్లాస్టిక్ డబ్బాలు, బాటిల్స్, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తామన్నారు. అత్యధికంగా వ్యర్థాలను సేకరించిన టాప్-3 పాఠశాలలకు మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవార్డులు అందిస్తామన్నారు. బాల్యం నుంచే ప్లాస్టిక్‌ను దూరం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించొచ్చన్నారు. నగరపాలక సంస్థ మరియు శక్తి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంపై మరిన్ని వివరాల కోసం 9494060060 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, ఇఇలు మదర్సా అలీ, మాధవి, పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వెళ్ళే బంధులదొడ్డి దారిలోని వ్యర్థాలను తొలగించి, అక్కడ చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు జి.అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి జివివిఎస్.ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

మత్స్యకారుల జీవనోపాధికి శిక్షణ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మత్స్యకారుల జీవనోపాధిపై ఇతర రాష్ట్రాలకు శిక్షణ కోసం వెళుతున్న 60 మంది మత్స్యకారుల బస్సులను సోమవారం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రారంభించారు. దొరబాబు మాట్లాడుతూ మత్స్యకారులు మూడు రోజులపాటు శిక్షణ కోసం కేరళ, తమిళనాడు వెళుతున్నారని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మత్స్యకారుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తమిళనాడులో రెండు బృందాలుగా మండపం చేరుకుంటుందని, అక్కడ ఉన్న సముద్రంలో నాచు పెంపకం, పగడపు దిబ్బలపై వివరిస్తారని తెలిపారు.

బిసిల సమైక్యతే బిసివై పార్టీ లక్ష్యం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాష్ట్రంలో బిసిలను ఒక తాటిపైకి తీసుకొచ్చి రాజ్యాధికార దిశగా ముందుకు పోవడమే బిసివై పార్టీ లక్ష్యం అని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గొంప శివకుమార్ యాదవ్ అన్నారు. ఈ నెల 11న విజయవాడలో నిర్వహించే బిసిల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బిసివై అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుండి బిసి నాయకులు హాజరవుతారన్నారు.

రబీ నీటి లభ్యతపై మురాలశెట్టి ఆరా

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

రబీ ఆకుమడులకు నీటి లభ్యతపై సోమవారం తూర్పు డెల్టా చైర్మన్ మురాల శెట్టి సునీల్ కుమార్ మండలంలో పలు రైతులను కలిశారు. చిత్రాడ, ఎండపల్లిలో ఆకుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులను కలిసి నీటి లభ్యత గురించి ఆరా తీశారు. వంతులవారీ నీటి వినియోగంలో పలు సూచనలు అందిచారు. నీటి సరఫరా పెంచాలని మదపురం, కొత్తపల్లి, కొమరగిరి గ్రామల రైతులు కోరారు. నీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సునీల్ కుమార్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బసవ సత్తిబాబు, పెంకే జగదీష్, దేసినీడి సతీష్, గుంద్ర జగ్గారావు, మత్స్రాశ్రీనివాసరావు, గుంద్ర కిశోర్, గుంద్ర బాబ్జి, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -తాళ్లరేవు

ఇతర జిల్లాల నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ ఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనీష్ అన్నారు. సోమవారంకోరంగి పోలీస్ స్టేషన్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్లో గతం కంటే క్రైమ్ రేటు తగ్గిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 255 కేసులకుగాను 120కి తగ్గించినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, క్రైమ్ రేటు తగ్గించడానికి కోరంగి ఎస్ఐ సత్యనారాయణ తీసుకున్న చర్యలను ఆయన అభినందించారు. సిఐ చైతన్య కృష్ణ పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సమస్యలు సృష్టించినా, లేదా ప్రేరేపించినా అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహకిశోర్ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించిన ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీశామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినతులపై దృష్టి సారించాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందించే వినతులపై దృష్టి సారించాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 23 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజినీరింగ్‌కి సంబంధించి 7, రెవెన్యూకి సంబంధించి 2, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి 5, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి 4, మెప్మాకు సంబంధించి 3, వార్డు సచివాలయాలకు సంబంధించి ఒకటి, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా అర్జీదారులతో నేరుగా కమిషనర్ మాట్లాడారు. పిజిఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. కనుక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. కోలమూరు పంచాయతీలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తొందరలోనే నూతన డ్రెయినేజీలను నిర్మిస్తామన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బందితో మాట్లాడారు. వారి దైనందిన విధులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వివిధ విభాగాల సెక్రటరీలు ప్రతి రోజూ విధులను కచ్చితంగా డైరీలో పొందుపరచాలన్నారు. ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్యతో సచివాలయానికి వచ్చేవారు నిరుత్సాహంతో వెనుదిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌కు 213 అర్జీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 213 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అర్జీలు సమర్పించేందుకు ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తేమ శాతం పేరిట రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. యూరియా పుష్కలంగా అందుబాటులో ఉన్నందున రైతులకు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో అందిన అర్జీలను వేగంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు హాస్టళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి వై.మేఘస్వరూప్, డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి, ఎస్‌డిసి ఎస్.భాస్కర్‌రెడ్డి, పి.భాగ్యలక్ష్మి, సిపిఒ, జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పలకొండ, డిఎస్‌పి విద్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా అధ్యక్షునిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి - కడియం

ఎస్‌టియు జిల్లా అధ్యక్షునిగా ఎం.లక్ష్మణరావు ఎన్నికయ్యారు. గైట్‌లో జరిగిన ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు .ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సిహెచ్‌సికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ సౌమ్య ఎంఎల్ఏశ్రీ వరుపుల సత్యప్రభను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని విధాలుగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

ఘనంగా క్లాప్స్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -పెద్దాపురం

స్థానిక బిఆర్.అంబేద్కర్ భవనంలో సోమవారం క్లాప్స్ వ్యవస్థాపకులు డాక్టర్ లంక పురుషోత్తమ దాస్, బిషప్ సిబిఐ సుకుమార్ పర్యవేక్షణలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెక్రటరీ జిమ్స్ శ్రీనివాస్ ప్రెసిడెంట్ జి.సత్యానందం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జిఆర్.ఇమ్మానియేల్ రాజ్ వర్తమానం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ యార్లగడ్డ మన్నా, జోసెఫ్ బెన్నీ, డి.సామ్యూల్ సాగర్, డాక్టర్ సీరం ఐజాక్, డాక్టర్ పి.సురేంద్ర కుమార్, ఎం.విజయ్ కుమార్, నళిని, డాక్టర్ విజయలక్ష్మి, టి.బ్లెస్సింగ్, డి.వెంకట్‌పాల్, జ్ఞానానందం, డాక్టర్ డిఎస్‌పి.రావు, ఎన్.సుకుమార్, జె.జోసెఫ్ కుమార్, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-జగ్గంపేట

స్థానిక జగనన్న కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను సోమవారం అధికారులు తొలగించారు. కాలనీకి సిపి ల్యాండ్‌గా ఉంచిన స్థలాన్ని కొందరు ఆక్రమించి లే అవుట్ వేసి అమ్మకాలు చేయడంతో పాటు బిల్డింగ్‌లు నిర్మిస్తున్నారు. కాలనీ వారికి కమ్యూనిటీ స్థలంగా ఉంచిన ప్లేస్‌లో అక్రమ కట్టడాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందడంతో వారు అక్కడకు చేరుకుని వాటిని తొలగించారు. ఆర్ఐ జి.మంగపతి నాయుడు, విఆర్‌ఒ బొరగ నాగసత్యనారాయణదొర ఉన్నారు.

పాడా పిజిఆర్ఎస్‌కు 43 అర్జీలు

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాడా కార్యలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో పాడా పీడీ శ్రీనివాసరావు ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై 43 అర్జీలు అందాయని ఇందులో రెవెన్యూ 15, హౌసింగ్ 2, పిఆర్ 5, మున్సిపాలిటీ 11, ఇతరాలు 6 వచ్చాయని తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

పథకాల అడ్డగంతపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-పెద్దాపురం

ఆనూరులో దళితులకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డిఒ కె.శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దళిత కాలనీలో పట్టాలు లేని 40 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, దళిత మహిళ ఇల్లు కట్టుకుంటే అడ్డుకుంటున్నారన్నారు. ఈ అంశాలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, మడికి సత్యం, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి, కె.రామలింగేశ్వర రావు, సత్తిబాబు, పైడిమల్ల నాగరాజు, ఏషియా, గానుగుల సతీష్, అప్పారావు, చెక్కా సత్తిబాబు, పైడిమల్ల యమున, శిరీష, మంగశ్రీ, లోవ, గానుగుల సతీష్ పాల్గొన్నారు.

గోదావరి తీరం పర్యాటక సౌరభం

ప్రజాశక్తి-కడియం

గోదావరి తీరం సహజ సిద్ధమైన ప్రకృతి ప్రసాదించిన పర్యాటక సౌరభమని ప్రముఖ రచయిత, సినీ నటులు ఎల్‌బి.శ్రీరామ్ అన్నారు. గోదావరి తీరంలో జరుగుతున్న ఒక టెలీ షూటింగ్ సోమవారం ధవళేశ్వరం రామపాదాల రేవు సమీపంలో గోదావరి ఒడ్డున జరిగింది. ఇందులో ఎల్‌బి.శ్రీరామ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 15న కడియంలో జరిగే జంట కవుల రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమానికి కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, చెళ్లపిళ్ల కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు ఆయన్ని కలిసి ఆహ్వానించారు. గతంలో ఆయన చెళ్లపిళ్ల స్మారక పురస్కారం అందుకున్నారు. జంట కవులతో పాటు, ఆదికవి నన్నయ, శ్రీపాద, చిలకమర్తి కందుకూరి, బాపు రమణ లకు సాహితీ ప్రజ్వలనానికి గోదావరి తీరమే నాంది అన్నారు. గోదావరి నది తెలుగు సాహిత్యాన్ని ఎంతో ఉరకలు వేయించిందని ఎల్‌బి అన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా అబ్దుల్లా

ప్రజాశక్తి - నిడదవోలు

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులుగా మహ్మద్ అబ్దుల్లా నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో ప్రజలకు భద్రతా లేదన్నారు. దేశాన్ని కార్పొరేట్ సంస్థలు పాలిస్తున్నాయన్నారు. దేశంలో అందరూ బాగుండాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం కోసం కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన జిల్లా అధ్యక్షులు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డికి, నియోజకవర్గం కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పట్నాయక్

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైనట్లు ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యా సంస్థలు, ఎన్ఐటి, ఐఐఐటి, విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లు, పారిశ్రామిక నిపుణులు పాల్గొంటారని తెలిపారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 6 జి విభాగంలో పరిశోధనకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని అధ్యాపకులు, పరిశోధకులు దీన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్‌వివి.కృష్ణ మాట్లాడుతూ 6జి టెక్నాలజీ రాబోయే దశాబ్దంలో ప్రపంచాన్ని మార్చే కీలక పరిశోధన రంగం అనాన్రు. అధ్యాపకులు, పరిశోధకులు ఇందులో కొత్త అంశాలను అన్వేషించడానికి ఈ ప్రోగ్రామ్ ఎంతో పయోగపడుతుందని పేర్కొన్నారు. డీన్స్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, డాక్టర్ పిఎస్‌వివిఎస్.రవికుమార్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.అనిల్ కుమార్ మాట్లాడారు.

ప్రాథమిక చికిత్సపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఏ విధంగా రక్షించాలనే విషయాలపై ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సోమవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. రాజపూడి, మల్లిశాల, రామవరంలోని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిపిఆర్ చేయడం, తుపాను వచ్చినప్పుడు ఎలా రక్షించాలి, నీటి ప్రమాదంలో పడినప్పుడు ఏ విధంగా సాయం అందించాలనే విషయాలను వారికి తెలిపారు. భూకంపం, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా రక్షణ పొందాలి అనే విషయాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో పరువు తీశారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

గతంలో ఎన్నడూ లేని విధంగా లక్షల మంది ప్రయాణికులను ఇబ్బందులు పెట్టారని, ఇది కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. ఈ ఘటనకు మంత్రి రామ్మోహన్‌నాయుడు బాధ్యత వహించాలన్నారు. సివిల్ ఏవియేషన్‌కి మంత్రిగా ఉన్న రామోహన్‌నాయుడుకి సరైన అవగాహనలేదని విమర్శించారు. మంత్రిగా పని చేస్తున్న ఆయన తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని అంతర్జతీయ స్థాయిలో మంటగలిపారన్నారు. ఇండిగో సంస్థ, పైలెట్ల మధ్య ఏడాది కాలంగా వివాదం జరుగుతుందన్నారు. దీన్ని నేటి వరకు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇండిగో సంస్థ విషయంలో మంత్రి నారా లోకేష్ ఎలా మోనటరింగ్ చేస్తారని ప్రశ్నించారు..పైలెట్ల అవసరాలు, వారి పని దినాలను ఎందుకు పరిగణలోకి తీసుకోరని ప్రశ్నించారు. పైలెట్లకు మానసిక విశ్రాంతి చాలా అవసరమని, దీనిని దృష్టిలో ఉంచుకోకుండా ప్రకటనలు చేయడం సరైనది కాదన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు మల్లిశాల గ్రామానికి చెందిన మట్టే శ్రీనివాస్, మట్టే సింగర పద్మరాజు, మట్టే శ్రీహర్ష సాయం అందించగా ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, కొత్త కొండబాబు, టిడిపి నాయకులు జీను మణిబాబు, మద్దాల సత్యనారాయణ, సత్యనారాయణ, సర్వసిద్ది లక్ష్మణరావు, ముండ్రు ఎర్రబాబు, రాయి సాయి, వేములకొండ జోగారావు, పిలా మహేష్, బద్ది సురేష్ పాల్గొన్నారు.